# సామ్రాజ్యవాదుల మోసకారీతనానికి వ్యతిరేకంగా

## హండూరాస్‌లో పెల్లుబికిన ప్రజాగ్రహం




**హండూరాస్** రాజధాని టెగుసిగల్పను సైన్యం స్వాధీనం చేసుకోవటాన్ని నిరసిస్తూ సైన్యాన్ని ధిక్కరించి లక్షలాదిమంది ప్రజానీకం ప్రజాకవాతు నిర్వహించారు; దేశవ్యాపితంగా ప్రజానీకం రహదారులను దిగ్బంధించారు; మంటలతోకూడిన బ్యారికేడ్లను ఏర్పరిచారు; టోల్‌గేట్లను మూసివేసి, వ్యూహాత్మకమైన వంతెన లను తాము స్వాధీనం చేసుకున్నారు. నవంబర్ 26న దేశంలో నిర్వహించబడిన ఎన్నికలలో అత్యున్నత ఎన్నికల న్యాయస్థానం మరియు జువాన్ ఆర్లాండో హెర్నాండెజ్‌లు ఫలితాలను తారుమారు చేసి మోసానికి పాల్పడ్డారని హండూరాస్ ప్రజలు ఆరోపిస్తూ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. ప్రజలపై సైన్యం క్రూర నిర్బంధ చర్యలకు పాల్పడుతున్నప్పటికీ, మూడువారాలుగా ప్రజల నిరసనలు కొనసాగుతూనే వున్నాయి. సైన్యం ప్రయోగించిన నిర్బంధం కారణంగా 20 మంది పౌరులు చనిపోగా, మరో 70మంది గాయాలపాలయ్యారు. 800 మందిని అరెస్టు చేశారు. కాగా మరి అనేక మంది 'అదృశ్యమ'య్యారు. అమెరికా సామ్రాజ్యవాదం ద్వారా సాయుధమైన హండూరాస్ సైన్యం, పోలీసులు నిరసన ప్రదర్శనలకు నాయకత్వం వహిస్తున్న వారిని అపహరించుకు వెళ్ళటం మరియు హత్యలు గావించటం చేస్తూ వున్నారు. సైనిక దుస్తులలో వుండి, ముఖాలు గుర్తించవీలులేకుండా ముసుగులు ధరించిన అధికారులు, చట్టవిరుద్ధంగా ప్రదర్శనకారులను నిర్బంధించటమేగాక హత్యలు గావిస్తున్నారు. పగలు సమయాల్లోనూ సోదాల పేరుతో విచ్చలవిడిగా ప్రజల ఇండ్లలోకి జొరబడు తున్నారు. తీవ్రమైన కొట్లాటలు కొనసాగుతున్నాయి. ప్రతిపక్ష నాయకుడైన మాన్యుయెల్ నస్రుల్లా అమెరికా పాలనా యంత్రాంగంతో మాట్లాడి తాను అమెరికా ప్రయోజనాలను నెరవేరుస్తాననే హామీ యిచ్చేందుకు చర్యలకోసం వాషింగ్టన్ వెళ్ళాడు.

మూడువారాల విషమస్థితి అనంతరం, ఆపద్ధర్మ అధ్యక్షుడిగా వున్న జువాన్ ఆర్లాండో హెర్నాండెజ్ తన సమీప ప్రతిపక్ష అభ్యర్థిఅయిన సాల్వడార్ నస్రుల్లాపై 1.5 శాతం ఓట్ల స్వల్ప తేడాతో ఎన్నికల్లో విజయం పొందినట్లుగా సర్వోన్నత ఎన్నికల న్యాయస్థానం ప్రకటించింది. అదేరోజు, రెండవ ప్రపంచయుద్ధం తర్వాత స్థాపించబడిన అమెరికా సామ్రాజ్యవాదుల దౌత్యపర విభాగమైన ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్(ఓఎయస్) ప్రధానాధికారి లూయిస్ ఆల్ మాగ్రో ఈ క్రింది ప్రకటన విడుదల చేశాడు: 'విజేతను నిర్ధారించటం అసాధ్యమైన పరిస్థితి నెదుర్కొనేందుకు, కొత్తగా సాధారణ ఎన్నికలకు పిలుపునివ్వటమే హండూరాస్ ప్రజలముందున్న ఏకైకమార్గం'. హండూరాస్ ప్రజలపైన తమ కనుకూలమైన పాలకులను రుద్దటమే అమెరికా సామ్రాజ్యవాదుల ఉద్దేశ్యమని పై వ్యాఖ్య వెల్లడి చేస్తోంది. అమెరికా సామ్రాజ్యవాదం సృష్టించిన హండూరాస్‌లోని వంచనాత్మక పరిస్థితిని అర్థం చేసుకునేందుకు ఇటీవలి చరిత్రను కొంత పరిశీలించాలి.

హండూరాస్‌లో అమెరికాకు సైనిక, ఆర్థిక ప్రయోజనాలు ఇమిడివున్నాయి. దశాబ్దాలుగా, అమెరికా రక్షణస్థావరమైన పెంటగాన్–క్యూబా, నికరాగువా, గ్వాటిమెలా, ఎల్‌సాల్వడార్, డొమినికన్ రిపబ్లిక్ మరియు ప్రస్తుతం సెంట్రల్ అమెరికాలోని అత్యంత పొడవైన 'రన్‌వే' కల్గిన పల్మెరోలానుండి సైనిక జోక్యాలకు పాల్పడుతోంది. 2009 నుండి హండూరాస్‌కు అమెరికా 11 కోట్ల 40 లక్షల డాలర్లను సహాయంగా అందజేసింది.

డోల్ మరియు చిక్విటాలనే వ్యవసాయ వాణిజ్య గుత్తకంపెనీలకు హండూరాస్‌లో పెద్ద పెద్ద తోటలు వున్నాయి. ప్రపంచ బడా ద్రవ్య పెట్టుబడిదారులను వాటాదారులుగా కలిగిన డైనాంట్ అనే హండూరాస్ కంపెనీ ఆఫ్రికన్ పామ్‌ఆయిల్ ఉత్పత్తిదారులలో పెద్దదిగా వుంది. 2009 సైనిక తిరుగుబాటు తర్వాత కాలంలో– అప్పటి ఆఫ్రికా దేశస్థుల, స్థానిక మూలవాసుల, తెగల స్వాధీనంలోనున్న భూములను, నీటి వనరులను ప్రభుత్వం విదేశీ గనుల తవ్వకం కంపెనీలకు కట్టబెట్టింది.

2009 సైనిక తిరుగుబాటు తర్వాత కాలంలో దేశంలో పేదరికం 10శాతం పెరిగి మూడింట రెండువంతుల జనాభా దారిద్ర్యరేఖ దిగువకు నెట్టబడ్డారు. హండూరాస్‌లో ఉద్యోగ విరమణచేసిన మరియు ప్రస్తుతం ఉద్యోగులుగా వున్న వారు నిలకడగా 'ఆకస్మిక తిరుగుబాటు' 'అంతర్గత యుద్ధం' అనే హెచ్చరికలను ఎదుర్కొంటూ వున్నారు. ఇవి హండూరాస్ సమాజంలో నెలకొన్న సంక్షోభానికి సూచికలుగా వున్నాయి. 2009లో జరిగిన సైనిక తిరుగుబాటు ద్వారా అధ్యక్షస్థానం నుండి మాన్యుయెల్

జెలాయాను కూలదోయటాన్ని వ్యతిరేకిస్తూ ఆనాడు ప్రజానిరసనలు పెల్లుబికాయి. ఈనాటి లాగానే ఆనాడు కూడా ప్రజలపై క్రూర నిర్బంధం ప్రయోగించబడింది. హెర్నాండెజ్ నాయకత్వంలో అమెరికా నూతన ప్రభుత్వాన్ని ఏర్పరచి, ప్రతిపక్షం మరియు ఓఏఎస్‌లతో కలిసి ఒక ఒప్పందానికొచ్చింది. అదే సమయంలో ప్రజలపై నిర్బంధం ప్రయోగించాలని పోలీసులకు, సైన్యానికి ఆదేశాలిచ్చారు. హక్కుల ఉద్యమ కార్యకర్తలను, స్థానిక మూల వాసులైన తెగలను, ఆఫ్రికా – హండూరాస్ ప్రజలను, మహిళలను, ఉపాధ్యాయులను, విద్యార్థులను, యువకులను, కార్మికయూనియన్ల నాయకులందరినీ భయ భ్రాంతులకు గురిచేశారు. సైన్యం, పోలీసులు అనేకమందిని హత్యగావించారు. ఇలా హత్య గావించబడినవారిలో పర్యావరణ ఉద్యమకారుడు బెర్టా క్యాసెరెస్ మరియు మానవహక్కుల నాయకుడు మార్గరిటా మురిల్లో వున్నారు.

ట్రంప్ పాలనాయంత్రాంగం కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తూ వుంది. అమెరికా ప్రయోజనాలకు సమర్ధనగా ప్రతిపక్షం చేస్తున్న వాగ్దానాలకు చెవొగ్గకుండా హెర్నాండెజ్‌నే అధికారంలో కొనసాగించాలని ట్రంప్ భావిస్తున్నాడు. ప్రస్తుతం హండూరాస్‌లో కొనసాగుతున్న పొదుపు చర్యలు, సైనికీకరణ; హండూరాస్ ప్రజలలో పెరుగుతున్న అశాంతి, అసంతృప్తులను అణచ టానికి సాగిస్తున్న నియంతృత్వ తరహా పాలన కొనసాగటం ముఖ్యమైనదిగా అమెరికా స్పష్టం చేసింది. పోలీసుబలగాల సమ్మెలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఆదేశించిన విధంగా ప్రజలపై నిర్బంధం ప్రయోగించటానికి అనేకమంది పోలీసు అధికారులు సిద్ధంగా లేరు. తన ఆదేశాలను అమలుచేయలేదనే కారణంతో 2016 నుండి నాలుగువేల మంది అధికారులను ప్రభుత్వం విధులనుండి తొలగించింది. ప్రత్యేక కమిషన్‌గా నియమించబడిన వారిలో 17మంది పోలీసు అధికారులు నవంబర్ 18న రాజీనామా చేశారు.

హండూరాస్ ప్రజలపై అమెరికా మరియు దాని కీలుబొమ్మ ప్రభుత్వం క్రూరనిర్బంధాన్ని ప్రయోగిస్తుండగా, హండూరాస్ బూర్జువా వర్గంలోని రెండు ముఠాల నడుమ అంతిమంగా ఒక ఒప్పందం కుదర్చటానికి ఓఏయస్ మధ్య వర్తిత్వం నెరపుతోందన్నది స్పష్టమౌతోంది.

ooooo